క్లుప్తంగా

హోటల్‌లో ఫుడ్ ఇన్‌స్పెక్టర్ తనిఖీ


వంటశాలను తనిఖీ చేస్తున్న కిరణ్‌కుమార్

ఖమ్మంమయూరిసెంటర్: నగరంలోని బైపాస్ రోడ్డులో గల శ్రీశ్రీశ్రీ హోటల్‌లో జిల్లా గెజిటెడ్ ఫుడ్ ఇన్‌స్పెక్టర్ ఆర్.కిరణ్‌కుమార్ మంగళవారం తనిఖీలు చేశారు. బిర్యాని వాసన వచ్చిందనే ఫిర్యాదుతో ఆయన హోటల్ వంటశాలను పరిశీలించి బిర్యాని శాంపిళ్లను సేకరించారు. వీటిని పరీక్షల నిమిత్తం ల్యాబ్‌కు పంపించనున్నట్లు తెలిపారు.

ఎంపీ పరామర్శ

ఖమ్మంవన్‌టౌన్: నగరంలోని కమాన్‌బజార్ మసీద్ సదర్ అజీజ్, ఆయన సోదరి ఇటీవల ఓ ప్రమాదంలో మృతిచెందగా.. వారి కుటుంబాన్ని ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి మంగళవారం పరామర్శించారు. కస్బాబజార్‌లోని మృతుల నివాసానికి వెళ్లి కుటుంబసభ్యులను ఓదార్చి, అండగా ఉంటామని భరోసా నిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా నాయకులు కొప్పుల చంద్రశేఖర్, మైనార్టీ నాయకుడు ఎండీ ముస్తఫా, మిక్కిలినేని నరేందర్, మజీద్, ఖాసీం, ఇమామ్ మియా, హకీం, గఫార్ తదితరులు పాల్గొన్నారు.

చేప పిల్లల పంపిణీ

రఘునాథపాలెం: రఘునాథపాలెం గ్రామపంచాయతీలోని చేపల చెరువులకు రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా అందజేసిన చేప పిల్లలను మంగళవారం మత్స్యశాఖ ఏడీ శివప్రసాద్ ఆధ్వర్యాన రఘునాథపాలెం మత్స్యశాఖకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం జిల్లా ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు మామిళ్ల వెంకటేశ్వర్లు, రఘునాథపాలెం మత్స్య శాఖ సంఘం అధ్యక్షుడు పందుల ఉపేందర్, డైరెక్టర్లు చిక్కుల రామయ్య, ముద్రబోయిన వెంకటేష్, పందుల సత్యం, మత్స్యశాఖ సభ్యులు అక్కిసాయి, జింకల రవి, జింకల బద్రి, చిలక గోపాలు, శీను, గవాసి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

దాడికి పాల్పడిన ముగ్గురిపై కేసు

కామేపల్లి: భూతగాదా విషయంలో దాడికి పాల్పడిన ముగ్గురిపై కేసు నమోదైంది. వివరాలిలా.. మండలంలోని బాసిత్‌నగర్ గ్రామానికి చెందిన బానోత్ రామదాసు, చంప్లీ, రాంచరణ్ అదే గ్రామానికి చెందిన బానోత్ రేణుకపై భూతగాదా విషయంలో వాగ్వాదం జరిగి దాడికి పాల్పడ్డారు. దీంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయగా ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై సాయికుమార్ తెలిపారు.

ఆటో దొంగలు అరెస్ట్

ఖమ్మంక్రైం: ఆటో చోరీ చేసిన ఇద్దరు నిందితులను ఖమ్మం వన్‌టౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. మంగళవారం కస్బాబజార్‌లో సుధాకర్‌కు చెందిన ఆటోను నిజాంపేటకు చెందిన కొనకంచి ప్రతాప్, దాసరి రాజశేఖర్ ఇటీవల చోరీ చేశారు. బాధితుడి ఫిర్యాదుతో దర్యాప్తు చేయగా నిందితులను అరెస్ట్ చేసి ఆటోను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ ఉదయ్‌కుమార్ తెలిపారు.

స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కండి


సమావేశంలో మాట్లాడుతున్న ఉపేంద్రసాహు

తిరుమలాయపాలెం: త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీ కార్యకర్తలు సిద్ధం కావాలని బహుజన సమాజ్‌వాదీ పార్టీ(బీఎస్పీ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉపేంద్రసాహు పిలుపునిచ్చారు. మంగళవారం తిరుమలాయపాలెం మండల కేంద్రంలో జరిగిన పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులు, బీసీలు, నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. బడుగు, బలహీన వర్గాలకు విఘాతం కలిగించే జీఓ 29ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీఎస్పీ ప్రధాన కార్యదర్శి మిర్యాల నాగరాజు, నాగేశ్వరరావు, ఎన్నబోయిన రమేష్, రాజేంద్రప్రసాద్, నల్లగట్టు శంకర్, కొండ్రు రమేష్, సాయి చరణ్, బచ్చలకూర శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

నగరంలో సినిమాలు

తిరుమల	దేవర
వినోద	జనక అయితే గనక
సాయిరాం	విశ్వం
ఆదిత్య	రాధేకృష్ణ
శ్రీనివాస	వేట్టయన్ ద హంటర్
సినీ గెలాక్సీ	ఇద్దరు

\- ఖమ్మంగాంధీచౌక్


పనులు చేయిస్తున్న కార్యదర్శులు (ఫైల్)

బాధ్యత.. భారం!

పంచాయతీ కార్యదర్శులపై పని భారం
- నిధుల లేమితో అభివృద్ధి శూన్యం
- జీతాలు లేవని జీపీ కార్మికుల గైర్హాజరు
- అత్యవసర పనులకు కార్యదర్శులే చెల్లిస్తున్న వైనం
- ఒత్తిడితో పలువురి సెలవు..

నేలకొండపల్లి: పంచాయతీ కార్యదర్శులు పని భారంతో సతమతమవుతున్నారు. నిధులు లేమిపై అధికారుల ఒత్తిడితో పాటు ఉదయం, సాయంత్రం తేడా లేకుండా పనులు అప్పగించడంతో మనోవేదనకు గురవుతున్నారు. బీఎల్‌ఓలు నిర్వహించాల్సిన ఓటరు జాబితా విధులు కూడా కార్యదర్శులకే అప్పగించడంతో ఇటీవల సంబంధిత అధికారులను కలిసి వారు తమ గోడును వెళ్లబోసుకున్నారు. ఇది చాలాదన్నట్లు మండల, జిల్లా కార్యాలయ అధికారులు సైతం వేధింపులకు పాల్పడుతుండడంతో చేసేదేం లేక కొందరు మెడికల్ లీవ్స్ తీసుకుంటున్నారు. దీంతో ఉన్న వారిపై అదనపు భారం పడుతోంది.

నిధుల లేమి..

సర్పంచ్‌ల పదవీకాలం ముగియగా.. పంచాయతీలలో నిధుల లేమి వెంటాడుతోంది. కొన్ని నెలలుగా వేతనాలు చెల్లించకపోవడంతో నీటి సరఫరా, పారిశుద్ధ్యం ఇతరత్రా పనులకు వారు ముందుకురావడం లేదు. దీంతో గ్రామంలో అత్యవసర పనులకు కార్యదర్శులు జేబు నుంచి చెల్లించాల్సి వస్తోంది. ఇప్పటికే కార్యదర్శులు ఒక్కో పంచాయతీకి రూ. లక్షల్లో ఖర్చు చేసినట్లు చెబుతున్నారు.ఈ ఇబ్బందులు పడలేక పాలేరులోని పలు గ్రామాల్లో కొంతమంది పోటీ పరీక్షలకు సన్నద్ధమని, మరికొందరు మెడికల్ లీవ్‌లో వెళ్తున్నారు.

ఒత్తిడితో సతమతం..

రోజు ఉదయం 7 గంటలకే క్షేత్రస్థాయి నుంచి డైలీ శానిటేషన్ రిపోర్ట్(డీఎస్‌ఆర్) పంపించాలి. నిత్యం మురుగు కాల్వల శుభ్రం, వీధి దీపాల నిర్వహణ, ఇంటి పన్నుల వసూళ్లు, రోడ్డు, పల్లె ప్రకృతివనాలు, డంపింగ్ యార్డులు, వైకుంఠధామాలు, ఉపాధిహామీ, నర్సరీలు, మొక్కలు పరిరక్షణ, ఓటరు జాబితా, గ్రామీణ నీటి సరఫరా ఇలా అన్ని చోట్లకు వెళ్లి ఫొటో దిగి ప్రత్యేక యాప్‌లో పోస్టు చేయాలి. ఈ విషయంలో కొందరు ఎంపీడీఓ, ఎంపీఓలతో పంచాయతీ కార్యదర్శులకు మధ్య వివాదాలు తలెత్తుతున్నాయి. జీతాలు ఇవ్వడం లేదని పంచాయతీ కార్మికులు విధులకు నిరాకరిస్తుండడంతో కార్యదర్శులు ఆందోళనకు గురవ్వక తప్పని పరిస్థితి నెలకొంది.

పని భారం తగ్గించాలి..



ప్రస్తుత కార్యదర్శులపై ప్రభుత్వం అదనపు భారం పెడుతోంది. గ్రామంలో అన్ని రకాల పనులను వారితోనే చేయించడం సరికాదు. ఇప్పటికైనా కార్యదర్శులకు పని భారం తగ్గించేందుకు చర్యలు తీసుకోవాలి.
\- గండు సతీష్, సర్పంచ్‌ల సంఘం మండల మాజీ అధ్యక్షుడు

వేతనాలు లేక అవస్థలు..



పంచాయతీలలోని మల్టీపర్పస్ వర్కర్లకు ప్రతీ నెలా వేతనాలు అందించాలి. సక్రమంగా వేతనాలు అందక అర్ధాకలితో పారిశుద్ధ్య పనులు చేయాల్సి వస్తోంది. ప్రభుత్వం ఇకనైనా అర్థం చేసుకుని తగిన చర్యలు తీసుకోవాలి.
\- బొడ్డు ఆంజనేయులు, మల్టీపర్పస్ వర్కర్స్ యూనియన్ నాయకుడు

అందుబాటులో ఉండాలి..



ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందించాలి. కార్యదర్శులు, సిబ్బంది సమన్వయంతో గ్రామాలలో పనులు చేయించాలి. పని ఒత్తిడి వలన ఎవరూ ఇబ్బంది పడొద్దు. దశల వారిగా పనులు చేసుకోవాల్సిన అవసరం ఉంది.
\- ఎం.యర్రయ్య, ఎంపీడీఓ

వినతుల వెల్లువ..

విద్యార్థుల జీవితాలతో చెలగాటం..


కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఖమ్మం మామిళ్లగూడెం: రాష్ట్ర ప్రభుత్వం ఏళ్ల తరబడిగా విద్యార్థుల ఫీజు బకాయిలు చెల్లించకుండా వారి జీవితాలతో చెలగాటమాడుతుందని స్తుందని జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నారాయణవరపు శ్రీనివాస్ ఆరోపించారు. మంగళవారం సమస్యలపై కలెక్టర్ ముజమిల్‌ఖాన్‌కు వినతిపత్రం అందజేశారు. తెలంగాణలో విద్యార్థుల ఫీజులు, స్కాలర్‌షిప్‌లకు బడ్జెట్ లేకపోవడం దారుణమని, ప్రభుత్వం వచ్చి పది నెలలు అవుతున్నా ఇంతవరకు పట్టించుకోలేదన్నారు. ఇంజనీరింగ్, ఫార్మసీ, మెడికల్, పీజీ, డిగ్రీ, ఇంటర్ విద్యార్థులకు సగం ఫీజుల మాత్రమే మంజూరు చేస్తున్నారని, మిగతా ఫీజులు కట్టలేక చాలామంది మధ్యలోనే చదువు మానేస్తున్నారని మండిపడ్డారు. బీసీ స్టడీ సర్కిల్‌కు రూ.200 కోట్లు పెంచాలని, అన్ని ఉద్యోగ పోటీ పరీక్షలకు కోచింగ్ ఇవ్వాలని కోరారు. వినతి అందించిన వారిలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ లింగబోయిన పుల్లారావు, వెంకటరామయ్య, నాగేశ్వరరావు, ధనేశ్వర్‌రావు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

దళిత బంధు మంజూరు చేయాలి


అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: దళిత బంధు నిధులు మంజూరు చేసి వెంటనే లబ్ధిదారుల ఖాతాలో జమ చేయాలని బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు బొమ్మెర రామ్మూర్తి కోరారు. ఈమేరకు మంగళవారం అదనపు కలెక్టర్ శ్రీజకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ రాగానే రూ.12 లక్షలు దళిత బంధు ఇస్తామని చెప్పి 10 నెలలు దాటినా ఇప్పటి వరకు నిధులు విడుదల చేయలేదన్నారు. తక్షణమే దళిత బంధు నిధులు మంజూరు చేయాలని, ఇచ్చిన హామీలన్నీ అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నెమలి కిషోర్, ఆరెంపుల వీరభద్రం, నేరెళ్ల, ఆరోన్, వెంకటేష్, మాధవి, శివాజి, వెంకటేష్, చేకూరి సతీష్, చేకూరి నరేష్ తదితరులు పాల్గొన్నారు.

హామీలు అమలు చేయాలి


ఇన్‌చార్జ్ తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న దృశ్యం

కూసుమంచి: రైతులకు ప్రభుత్వం తక్షణమే రైతు భరోసా నిధులను విడుదల చేయాలని తెలంగాణ రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు మంగళవారం ఇన్‌చార్జ్ తహసీల్దార్ కరుణశ్రీకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రైతులకు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కిందన్నారు. ఈ సీజన్‌కు రైతులకు రైతు భరోసా ఇవ్వలేమని వ్యవసాయ మంత్రి పేర్కొనడం సరికాదని, రైతులను మోసం చేసిన ప్రభుత్వాలు మనుగడ సాగించలేవని హెచ్చరించారు. వెంటనే ఇచ్చిన మాట ప్రకారం రైతు భరోసా నిధులు విడుదల చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి యడవల్లి రమణారెడ్డి, రైతు సంఘం జిల్లా నాయకుడు మల్లెల సన్మంతరావు, నాయకులు శీలం గురుమూర్తి, తోటకూరి రాజు, బిక్కసాని గంగాధర్, గన్యానాయక్, వీరారెడ్డి, కర్ణబాబు, వెంకటేశ్వరరావు, వీరస్వామి, వెంకన్న, వెంకటయ్య, తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య లోపంతో ప్రజల అవస్థలు


వినతిపత్రం ఇస్తున్న సీపీఎం నాయకులు

ఖమ్మంరూరల్: మండలంలోని పలు గ్రామాల్లో పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా ఉందని, దీంతో ప్రజలు నానా అవస్థలు పడుతున్నారని సీపీఎం మండల నాయకుడు పి.వెంకటరమణ అన్నారు. మంగళవారం కాచిరాజుగూడెంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామంలో నెల రోజుల నుంచి చెత్తసేకరణ చేయడంలేదని దీంతో వీధుల్లోని సైడ్ కాల్వల్లో మురుగునీరు చేరి దుర్గంధంతో వెదజల్లుతోందన్నారు. గ్రామ పంచాయతీలకు ప్రభుత్వాల నిధులు సకాలంలో రాకపోవడంతో పారిశుధ్యం పనులు చేయలేకపోతున్నారని తెలిపారు. ఈ విషయమై మండల అధికారులకు తెలిపినా ఎవరూ పట్టించుకోవడంలేదని, ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని పనులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈమేరకు గ్రామ కార్యదర్శికి వినతిపత్రం అందించారు. ఈ సమావేశంలో నాయకులు ఎ.వేలాద్రి, పి.భాస్కర్ రావు, ఎం.ఉపేందర్‌రావు, వెంకన్న, ఎ.నాగేశ్వర రావు, రామారావు, క్రిష్ణ, నారాయణ, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ


విద్యార్థుల ప్రగతిపై ఆరా తీస్తున్న రవికుమార్

ఖమ్మంఅర్బన్: విద్యార్థుల్లో ప్రగతిని ఎప్పటికప్పుడు గుర్తిస్తూ వెనకబడిన వారికి ప్రత్యేక బోధన చేపట్టాలని జిల్లా విద్యాశాఖ అకడమిక్ మానిటరింగ్ అధికారి కె.రవికుమార్ ఉపాధ్యాయులకు సూచించారు. ఖమ్మం బాలాజీనగర్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలను మంగళవారం సందర్శించిన ఆయన సమ్మేటివ్ అసెస్‌మెంట్ పరీక్షల నిర్వహణ, విద్యార్థుల ప్రగతిని పరీక్షించి ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. ఆతర్వాత మధ్యాహ్న భోజన నాణ్యతను తనిఖీ చేశారు. ప్రధానోపాధ్యాయులు అజిత, జయలలిత ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యారంగాన్ని బలోపేతం చేయాలి


సదస్సులో మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

ఖమ్మంసహకారనగర్: నూతన ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేసి ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేయాలని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు యలమద్ది వెంకటేశ్వర్లు అన్నారు. పీఆర్‌టీయూ జిల్లా శాఖ ఆధ్వర్యాన మంగళవారం నూతన ఉపాధ్యాయులకు సర్వీస్ రూల్స్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. సర్వీస్ మేటర్స్, లీవ్ రూల్స్, పాఠశాలలో నిర్వహించే వివిధ రికార్డులు, ఎస్‌ఆర్ నిర్వహణ, పాఠశాలలో వినియోగించే వివిధ యాప్‌లపై పాపారావు, టి.విజయ్ అమృత్ కుమార్, టి.రత్నకుమార్ వివరించారు. అనంతరం యలమద్ది వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. విద్యార్థులకు స్ఫూర్తిదాయక సేవలందించి ప్రజల మన్ననలు పొందాలని, అందుకు పీఆర్‌టీయూ అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో సాధు లక్ష్మణరావు, కె.శేఖర్‌రావు, కె.సైదయ్య తదితరులు పాల్గొన్నారు.


పంటల సంరక్షణే ధ్యేయంగా ముందుకు

నేలకొండపల్లి: రైతుల పండించిన పంటల సంరక్షణ ధ్యేయంగా నాట్కో కంపెనీ కొత్త ఉత్పత్తిని ప్రారంభించినట్లు కంపెనీ ఇండియా సేల్స్ అండ్ మార్కెటింగ్ హెడ్ నర్సయ్య అన్నారు. మండలంలోని రాయగూడెం గ్రామం వద్ద మంగళవారం రైతులకు అవగాహన సదస్సు నిర్వహించి బ్రోచర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నాణ్యతలో రాజీ పడకుండా, అందుబాటు ధరల్లో ఉత్పత్తులు లభించనున్నాయని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ తీగ వెంకటేశ్వర్లు, తెలంగాణ మార్కెటింగ్ మేనేజర్ సుధీర్ సోమ, ఖమ్మం టెర్రటరీ మేనేజర్, డ్రిస్టిబ్యూటర్లు, రైతు ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి పత్తి కొనుగోళ్లు..

నేలకొండపల్లి: ముదిగొండ మండలంలోని సువర్ణాపురం గ్రామంలో ఉన్న ఉషా శ్రీ జిన్నింగ్ మిల్లు వద్ద పత్తి కొనుగోలు కేంద్రాన్ని బుధవారం మంత్రి పొంగులేటి క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జ్ దయాకర్‌రెడ్డి ప్రారంభించనున్నట్లు నేలకొండపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వెన్నపూసల సీతారాములు తెలిపారు. మంగళవారం తన చాంబర్‌లో మాట్లాడుతూ.. రైతులు నాణ్యత ప్రమాణాలు పాటించి మద్దతు ధర పొందాలని సూచించారు.

సమస్యల పరిష్కారానికి కృషి


సమావేశంలో మాట్లాడుతున్న పోటు ప్రసాద్

ఖమ్మంమయూరిసెంటర్: డబుల్ బెడ్రూం ఇళ్ల నివాసుల సమస్యల పరిష్కారానికి, అభివృద్ధికి సంక్షేమ సంఘం చిత్తశుద్ధితో కృషి చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ సూచించారు. నగరంలోని 60వ డివిజన్‌లో డబుల్ బెడ్రూం సంక్షేమ సంఘం సమావేశం నిర్వహించి, నూతన అధ్యక్షుడిగా బోడా వీరన్నను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా పోటు ప్రసాద్ మాట్లాడుతూ.. సంక్షేమ సంఘం డివిజన్ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. రహదారులు, డ్రెయినేజీ సౌకర్యం లేదని ప్రజాప్రతినిధులు, అధికారులను కలిసి నిధులు మంజూరు చేయించాలని సూచించారు. అనంతరం వీరన్న మాట్లాడుతూ.. సమస్యల పరిష్కారం కోసం ఐక్యంగా ముందుకు సాగుతామని తెలిపారు. ఈ సమావేశంలో సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు ఎస్‌కె జానిమియా, నాయకులు బోజడ్ల సూర్యం, పీట్ల కృష్ణమూర్తి, తేజావత్ కృష్ణ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బియ్యం వితరణ


రఘునాథపాలెం: మండలంలోని చిమ్మపుడి గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన పెంట్ర పూర్ణమ్మ కుటుంబానికి మంగళవారం మాజీ గ్రామ ఉపసర్పంచ్ గుత్తా వెంకటేశ్వర్లు 50 కేజీల బియ్యాన్ని వితరణగా అందించారు. గ్రామంలో నిరుపేద కుటుంబాల్లో ఎవరైనా మృతి చెందితే తనవంతు సాయంగా అందిస్తున్నట్లు వెంకటేశ్వర్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ వార్డుసభ్యులు కాకంగి వీరబాబు, మద్దుల నాగేశ్వరరావు, ఏసు, మధు, ఎల్లయ్య, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ సిబ్బందికి ప్రశంసాపత్రాలు


బహుమతులు అందిస్తున్న ఆర్‌ఎం సరిరామ్

ఖమ్మంమయూరిసెంటర్: రాఖీ, దసరా పండుగల సమయాల్లో ప్రత్యేక సర్వీసులను నడిపి ఉత్తమ పనితీరు కనబరిచిన ఖమ్మం డిపో డ్రైవర్లు, కండక్టర్లను ఆర్టీసీ ఖమ్మం ఆర్‌ఎం సరిరామ్ అభినందించారు. మంగళవారం ఖమ్మం డిపోలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారికి ప్రశంసపత్రాలు, బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఆర్‌ఎం జి.ఎన్.పవిత్ర, డిపో మేనేజర్ దినేష్‌కుమార్, ఏట బాలస్వామి, అసిస్టెంట్ మేనేజర్ రామయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రీ రిపబ్లిక్ డే పరేడ్‌కు ఎంపిక


నాగరాజుకు ఎంపిక పత్రం ఇస్తున్న ప్రిన్సిపాల్

నేలకొండపల్లి: జాతీయ సేవా పథకం ఆధ్వర్యాన పూణేలో జరగనున్న ప్రీ రిపబ్లిక్ డే పరేడ్‌కు నేలకొండపల్లి ప్రభుత్వ డిగ్రీ కాలేజీ విద్యార్థి కోనేటి నాగరాజు ఎంపికయ్యాడు. ఆయనకు మంగళవారం ఎంపిక ప్రతం అందజేసిన ప్రిన్సిపాల్ ఆలేటి పరంజ్యోతి మాట్లాడారు. నవంబర్ 12 నుంచి 21వ తేదీ వరకు జాతీయ స్థాయి పరేడ్ జరగనుందని తెలిపారు. ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ ఎన్.శ్రీనివాసరావు, అధ్యాపకులు డాక్టర్ ఎస్.రమేష్, డాక్టర్ నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

పన్నులు చెల్లించకపోతే సీజ్..


రెవెన్యూ అధికారులు, సిబ్బందితో సమీక్షిస్తున్న కమిషనర్ అభిషేక్ అగస్త్య

ఖమ్మంమయూరిసెంటర్: ఆస్తి, పంపు పన్నులు, ట్రేడ్ లైసెన్సుల ఫీజుల ద్వారానే కేఎంసీకి అత్యధిక ఆదాయం వస్తున్నందున బిల్ కలెక్టర్లు ప్రత్యేక దృష్టి సారించాలని కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య ఆదేశించారు. కేఎంసీలో మంగళవారం ఆయన రెవెన్యూ విభాగం అధికారులు, బిల్ కలెక్టర్లతో పన్నుల వసూళ్లపై సమీక్షించి మాట్లాడారు. ప్రతీ బిల్ కలెక్టర్ నిత్యం పన్నులు వసూలు చేయాలని, కమర్షియల్ భవనాల బకాయిలు చెల్లించకుంటే రెడ్ నోటీసులు ఇవ్వాలని, అయినా స్పందించకపోతే మరోమారు నోటీసు ఇచ్చి భవనాలను సీజ్ చేయాలని సూచించారు. కూలిపోయిన భవనాలు, అసలు భవనం లేకుండా పన్ను వస్తున్న వాటిని నివేదిక ఇవ్వాలని తెలిపారు. అలాగే, ప్రతీ దుకాణదారుడు, వ్యాపారులు ట్రేడ్‌లైసెన్స్ తీసుకునేలా అవగాహన కల్పించాలని కమిషనర్ చెప్పారు. ఆర్‌ఓ జి.శ్రీనివాసరావు, ఆర్‌ఐలు వి.రామారావు, జ్యోతి, విజయానంద్ తదితరులు పాల్గొన్నారు.

డంపింగ్‌యార్డ్ పరిశీలన..

కేఎంసీ డంపింగ్‌యార్డ్‌ను కమిషనర్ అభిషేక్ అగస్త్య మంగళవారం పరిశీలించారు. కంపోస్ట్ ఎరువు తయారీ వివరాలు తెలుసుకున్న ఆయన యార్డు లోపలకు వాహనాలు వచ్చివెళ్లేలా దారి ఏర్పాటు చేయాలని సూచించారు. ఈఈ కృష్ణాలాల్, తదితరులు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతితో అధిక దిగుబడులు


పంటలను పరిశీలిస్తున్న అధికారులు

కూసుమంచి: మిరప తోటల్లో వేరుకుళ్లు, కొమ్మకుళ్లు తెగుళ్లు ఆశించడంతో మంగళవారం ఉద్యాన, వ్యవసాయాధికారులు అపర్ణ, వాణి తోటలను పరిశీలించారు. మండలంలోని రావిచెట్టుతండా తదితర గ్రామాల్లో తోటలను పరిశీలించి తెగుళ్ల ఉధృతిని గుర్తించారు. ఈ సందర్భంగా రైతులకు పలు సూచనలు చేశారు. వేరుకుళ్లు, కొమ్మకుళ్లు తెగుళ్ల నివారణకు కాపర్, ట్రైకోడర్మా విరిడే, సూడోమోనస్ ద్రావణాల్లో ఏదైనా పిచికారీ చేసి నివారించుకోవచ్చన్నారు. రైతులు యాజమాన్య పద్ధతులు పాటించి మంచి దిగుబడులు సాధించాలని సూచించారు.

భూములకు పరిహారం ఇవ్వాలి


తహసీల్ ఎదుట ఆందోళన చేస్తున్న రైతులు

తిరుమలాయపాలెం: భారీ వర్షాలు, వరదలతో నష్టపోయిన పంటలు, భూములకు నష్టపరిహారం చెల్లించాలని కోరుతూ మంగళవారం తహసీల్దార్, వ్యవసాయశాఖ ఏఓ కార్యాలయాల ఎదుట రైతులు ధర్నా నిర్వహించి నిరసన తెలిపారు. భారీ వరదలతో ఆకేరు పరీవాహక ప్రాంతాల పంట భూముల్లో ఇసుక మేటలు వేసి తీవ్రనష్టం వాటిల్లిందని, అయినా ఇంత వరకు తమకు నష్టపరిహారం చెల్లించలేదని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి జోక్యం చేసుకుని రైతులకు నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం, సీపీఎం నాయకులు కొమ్ము శ్రీను, స్వామి, రవిశంకర్, దేశ్యా, సహదేవ్, పోతుగంటి రామయ్య, బుజ్జి, కోటయ్య, ధన్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

ఈద్గా కూల్చివేతపై ముస్లింల ధర్నా


ఈద్గా వద్ద ధర్నా చేస్తున్న ముస్లింలు

కూసుమంచి: మండలంలోని పాలేరు గ్రామంలోని ఈద్గాను కూల్చివేయడంపై మంగళవారం గ్రామానికి చెందిన పలువురు ముస్లింలు ఆందోళన చేపట్టి ధర్నా నిర్వహించారు. అనంతరం ఈ ఘటనపై పోలీసు, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. వివరాల్లోకి వెళితే.. గ్రామంలోని పాలేరు రిజర్వాయర్ సమీపాన గ్రామానికి చెందిన ముస్లింలు ఈద్గాను నిర్మించుకున్నారు. ఈ క్రమంలో 2005లో రక్షిత మంచినీటి పథకం నిర్మించే క్రమంలో ఈద్గాను తొలగించాల్సి రావడంతో అధికారులు మరోచోట ప్రభుత్వ స్థలాన్ని కేటాయించగా అందులో తిరిగి ఈద్గాను నిర్మించారు. ఈద్గా పక్కనే ఖమ్మంకు చెందినవ్యాపారి గత కొన్నేళ్ల క్రితం ఇంజనీరింగ్ కళాశాల ఏర్పాటు కోసమని భవనాన్ని నిర్మించాడు. ప్రస్తుతం అది నిరుపయోగంగా ఉంటుంది. ఈక్రమంలో నర్సింగ్ కళాశాల ఏర్పాటుకు సన్నాహాలు చేస్తుండగా ఈద్గా తన స్థలంలో అడ్డుగా ఉందంటూ భవన యజమాని దాన్ని కూల్చినట్లు గ్రామానికి చెందిన ముస్లింలు ఆరోపిస్తున్నారు. అధికారులు తమకు న్యాయం చేయాలని, ఈద్గాను తిరిగి నిర్మించేలా చూడాలని డిమాండ్ చేశారు.